# తెగులు కుదిరింది

కారు ఆగిన చప్పుడూ, కారు తలుపు మళ్ళీ వేసేసిన చప్పుడూ స్పష్టంగా వినపడ్డాయి.

''గుడ్‌నైట్ శశీ!'' అది మా శోభ గొంతు.

''గుడ్‌నైట్!.... రేపు సాయింత్రం నాలుగు గంటలకల్లా క్లబ్బుకి రావాలి. గ్లాడిస్, సుందరీ నాలుగున్నర కొస్తామన్నారు.''

''ష్యూర్, ష్యూర్. ఇంకా వీలయితే పెందరాళే వస్తాను. నువ్వు మాత్రం ధైర్యంగా వుండు. రెండు స్ట్రెయిట్ సెట్స్‌లో వాళ్ళని కొట్టేస్తాం."

''రైటో శోభా!.... ఛీరియో!"

''ఛీరియో ''

మేడమీద నాన్నగారి కెదురుగుండా పేపరు చదువుకుంటూ నేనూ నాన్నగారి కుర్చీ పక్క కుర్చీమీద అమ్మా కూర్చున్నాం. అంతవరకూ శోభ పెళ్ళి విషయంమీద సింహావలోకనం చేసింది మా అమ్మ. నేనూ నాన్నగారూ మాత్రం యథాప్రకారం మౌనం వహించాం మేడ మెట్లమీద శోభ చెప్పుల చప్పుడూ, కూనిరాగం వినబడుతున్నాయి.

టెన్నిస్ రేకెట్ మేకుకు తగిలించే ప్రయత్నంలో లాగుంచి కూనిదీర్ఘం మానేసింది. గదిలో ప్రవేశిస్తూనే "ఏమిటి అంతా చింతా నిమగ్నులైనట్టున్నారు!" అంటూ తనూ కుర్చీ లాక్కుని కూర్చుంది నేను ముందర మాట్లాడవలసొస్తుం దేమోనని పేపరు కిందకి దించలేదు. నాన్నగారు కూడా పుస్తకం మూసినట్లు కనబడదు. నేననుకున్నట్లు అమ్మే అందుకుంది.

''ఏమే అమ్మాయ్! రాత్రి తొమ్మిది గంటల వరకూ టెన్నీసే ఆడుతున్నావా? నాకు తెలియకడుగుతాను.'' అమ్మ అడిగింది.

"తెలియకడగడమే, తెలుసుండే అడిగేవు.'' శోభ అందుకుంది.

''పెళ్ళికాని పిల్లవి, చీకటిపడేలోగా యింటికి రమ్మని ఎన్నిసార్లు చెప్పాలి."

''పెళ్ళయిన పిల్లకి ఆ నిర్బంధం లేదా ఏమిటే?''

''అదుగో, ఆ డొంకతిరుగుడు సమాధానాలే కూడదంట.'

''నువ్వేసిన ప్రశ్నలు డొంక తిరుగుడు ప్రశ్నలు కావూ? ఇంత ఆలస్యం ఎందుకయిందే అని అడుగుతే - టెన్నిస్ ఆడుకున్న తర్వాత నేనూ శశీ కలిసి బీచికి షికారెళ్లాం. అందుకు ఆలస్యమైందీ అని చెబుదును."

"బీచి షికార్లూ, కాలేజీ మీటింగులూ, క్లబ్బు డిన్నర్లూ, సినిమాలూ.. "

"బర్త్‌డే పార్టీలు, కాలేజీ డ్రామా రిహార్సల్సు, మ్యూజిక్ ప్రాక్టీసులు.... ఏవో వొకటి రోజూ యింటికి పెందరాళే రావటానికి అడ్డం వస్తూనే వుంటా యంటావు. అవునా అమ్మా?"

అమ్మ అసహాయ స్థితిచూస్తే నాకే జాలేసింది. శోభతో వచ్చిన పేచీయే అది. తన హాస్యరసం, తెలివి తేటలూ ప్రదర్శించాలనే మాట్లాడుతుందికాని, ఎదుటివాళ్ళ హృదయం అర్థం చేసుకోటానికి ప్రయత్నించదు. కాని, యివ్వాళ్ళ అమ్మ శోభ పెళ్ళి విషయం అటో యిటో తేల్చెయ్యాలన్న పట్టుదలలో వుంది. అసలు అమ్మకూడా ఓపట్టాన్ని లొంగే మనిషి కాదు.

''అయితే రేప్పొద్దున్న పెళ్ళయితే రాత్రి తొమ్మిది గంటలకి క్లబ్బునుంచి యింటికొస్తే ఇంట్లో వంటెవరు చేసి పెడతారూ?''

"ఓస్.... పెళ్ళయినప్పటి మాటకదా.... అప్పుడే ఆలోచించుకోవచ్చు.''

"ఇంకా ఎప్పుడో అనుకుంటున్నావేమో? ముహూర్తం నిశ్చయించి రేపు మాఘమాసంలో చేసెయ్యటమే.''

"నువ్వు చూడబోయీ పెళ్ళికొడుక్కి ఓ పెళ్ళికూతుర్ని కూడా చూడు.... చేసేద్దాం."

"ఏమిటే నీ వుద్దేశం? ఇంకో యేడాదిలో నీకిరవైయేళ్ళొస్తున్నాయి. ఇంకా నలభయ్యోయేట పెళ్ళాడదామనా నీ వుద్దేశం?"

"నువ్వన్న యిరవైయ్యేళ్ళకీ నువ్వు భయపడుతున్న నలభయ్యేళ్ళకీ మధ్య నున్న వ్యవధిలో ఎప్పుడో ఒకప్పుడు పెళ్ళాడొచ్చు "

దానితోటి అమ్మ ''బెల్లంకొట్టిన రాయిలాగ అలా వూరుకుంటారేమిటండీ" అన్నట్టు మొహంపెట్టి, నాన్నగారికేసి చురచుర చూసింది. దానితోటి నాన్నగారు

పుస్తకం మూసేసి "శోభా! బియ్యే చదువుతున్నావు. కాని, కన్న తల్లితో ఎలా మాట్లాడాలో నీకు తెలీదు. నవమాసాలూ మోసి........" అంటూ మొదలెట్టేరు నాన్నగారు.

"అదికాదు నాన్నా...."

అప్పటికప్పుడే తన విధ్యుక్తధర్మాన్ని నెరవేర్చేరు నాన్నగారు. ఇంతలో నేననుకున్నంతపనీ అయింది. అమ్మ నావైపు తిరగడంతోటే శోభకూడా తిరిగింది. పేపరు పైకెత్తేశాను.

"చూడు అన్నయ్యా! నువ్వు చెప్పు. ఇప్పుడు నా పెళ్ళికేం తొందరొచ్చింది? నా చదువు పూర్తవ్వకుండా యీ నిర్బంధమేమిటి? ఇప్పుడు నీ చదువు మానెయ్యమంటే నీ కెలాగుంటుంది?" అంటూ శోభ నాకేసి తిరిగింది.

"అన్నయ్య చదువుకుంటాడు. ఉద్యోగం చేస్తాడు. నువ్వు కూడా ఉద్యోగం చేస్తావా?" అమ్మ అడిగింది.

"అవసరమైతే చేస్తాను. లేదా, చదువుకోటంలో తప్పేముంది?"

నిజానికి నా కిలాంటి వాదనంటే కిట్టదు. ఎంచేతంటే, యీ చదువుకు కూడా ఓ లక్ష్యం వుండాలి. పైకంటే కోపమొస్తుంది కాని, నూటికి తొంభైమంది ఆడవాళ్లు యీ రోజుల్లో డబ్బుందికనక మా శోభలాగ యీ కాలేజీ వాతావరణం యీ స్నేహితులూ యీ సరదాలూ యివన్నీ విడిచిపెట్టలేక సాధ్యమైనంతవరకూ విద్యార్థి దశను పొడిగించుకోవాలన్న వుద్దేశంతో చదువుకుంటున్నవాళ్ళే. వాళ్ళ లక్ష్యమల్లా సమాజంలో వాళ్ళు చదువుకున్న నవనాగరిక స్త్రీలుగా చెలామణీ అవ్వాలి. ఏ కొద్దిమందో స్వతంత్ర జీవిత సాధనకోసం, మరి కొందరు సహజమైన విద్యాభిలాష మూలంగానూ చదువుకుంటారు. నాకు తెలిసినంతవరకూ మా శోభ యీ రెండో తరగతిలోకి రాదు. ఇంతకీ నేను మాత్రం నోరు విప్పలేదు.

"చదవేస్తే వున్నమతి పోయిందనీ!........కొన్నాళ్ళుపోతే పెళ్ళే వద్దంటావనుకుంటాను." మా అమ్మభయం మా అమ్మది.

"చదివి మతి పోగొట్టుకోకముందే పెళ్ళాడివ్వాటి నాది. అమ్మా!........ కాలాన్నిబట్టి మనుషులూ పద్ధతులూ కట్టుబాట్లూ మార్చుకోవాలి. వెనకటి రోజుల్లాగే ముందురోజులూ వుంటాయనుకోకు. నా పెళ్ళిగురించి నువ్వేమి

బెంగ పెట్టుకోకు. పెళ్ళి చేసుకుంటాను. కాని, అది నా యిష్టమొచ్చినప్పుడు, నా కిష్టమైనవాణ్ణి. మానవ జన్మమెత్తినందుకు మొగాడు భార్యని ఎన్నుకోవడం, ఆడది భర్తని ఎన్నుకోవడం కనీస స్వతంత్ర మదగటమన్నమాట!"

'నీకు స్వతంత్రమిస్తే దిలీప్‌కుమార్‌నో, దేవానంద్‌నో........' అనేద్దామనుకున్నాను కాని మళ్ళీ మాటలు మింగేశాను. ఈ రోజుల్లో ప్రతీ చదువుకున్న ఆడదానికీ వుపన్యాసధోరణిలో మాట్లాడటం పరిపాటైపోయింది. ఎందుకూ-ఆ మధ్య గోదావరి వరదల సందర్భంలో పీళ్ళ కాలేజి సెక్రటరీ ప్రతిభాదేవి చందా కోసం నాన్నగారి దగ్గిరకొచ్చిన రోజున - అదృష్టవశాత్తూ పడక్కుర్చీలో కూర్చున్నానుకనక సరిపోయింది. అదేమిటో! వినేమనిషి ఒక్కడే అయినా నిండు సభలోలాగ ఒళ్ళు తెలియని ఆవేశంలో దారుణదృశ్యాలు కళ్ళ కికట్టినట్టు వర్ణిస్తూ పెద్ద వుపన్యాసం. చివరికి చెక్కుమీద సంతకం పెడుతుంటే నాన్నగారి చెయ్యి వణకటం కళ్ళారా చూశాను.

ధోరణి కొంచెం తీవ్రంగా వుందనిలాగుంది నాన్నగారు కలగజేసుకున్నారు:

"అదికాదు శోభా.... ...కామేశం యీమధ్య హైదరాబాద్ వెళ్ళారట. మళ్ళీ తిరిగి వెళ్ళిపోతూ ఎల్లుండి యిక్కడ దిగుతానని రాశాడు. మొన్న మీ అత్తయ్య రాసిన వుత్తరంబట్టి యీ సారి వీడు దిగటంచూస్తే........" నాన్నగారు అంటుంటే—

"పెళ్ళిచూపుల కొస్తున్నాడన్నమాట!" పూర్తి చేసింది మా అమ్మ.

"సరే, వద్దంటే మానాడుకనకనా-రానీ!" అంది శోభ.

కామేశం మా మేనత్త కొడుకు. కామేశం తండ్రి స్వతహాగా ఆస్తిపరుడు. దాన్ని కాస్తో కూస్తో వృద్ధిచేసి కామేశానికి పదోయేడు రాకుండానే పరమ పదించేడు. ఒక్కడే సంతానం అవ్వడంవల్ల మా అత్తయ్య వీణ్ణి ఎంతో గారాబంగా పెంచింది. దానాదీనా వీడికి జ్ఞాన మొచ్చింది మొదలు యింతవరకూ ఫేలవ్వకుండా ఒక క్లాసూ ప్యాసవ్వలేదు. నేనూ వాడూ ఒకే యీడువాళ్ళం. అంటే, శోభకంటే నాలుగేళ్ళు పెద్ద. శోభ బియ్యే రెండోయేడు చదువుతోంది. కామేశం ఇంటర్ రెండోయేడు చదువుతున్నాడు- రెండేళ్ళనుంచి.

''ఎంత అప్రతిష్ట! మనం వాళ్ళ కాళ్ళావేళ్ళాపడి సంబంధం నిశ్చయించుకోవల్సింది పోయింది. వాళ్ళంత వాళ్లు వచ్చి అడుగుతే మన మిలా బిగుసుకుపోవడమా?" అంటూ ముక్కు మీద వేలేసుకుంది మా అమ్మ.

"శోభా!.... నువ్వు అమ్మ చెప్పే విషయాలు జాగ్రత్తగా విని ఆలోచించి నిశ్చయించుకుంటే, మనం అటో యిటో నిర్ధారణ చేసి అత్తయ్యకి రాసేస్తే మన బాధ్యత తీరిపోతుంది" అన్నారు నాన్నగారు నిర్లిప్తంగా.

"అటోయిటో ఏమిటండీ!....మొదట్నుంచీ మీకిష్టంలేనీ సంబంధం.నేనెంత మొత్తుకుంటే ఏం లాభం? లేకపోతే... కావల్సిన సంబంధం. ఒకటికి పదిసార్లు నచ్చచెప్పవల్సింది పోయి... పైగా, అక్కర్లేదని చెప్పేస్తే బాధ్యత తీరిపోతుందని బోధిస్తున్నారు. ఇంకేమనుకోనూ!" నిర్ఘాంత పోయింది మా అమ్మ.

"అయితే, దాన్నాలోచించుకోనివ్వవా ఏమిటి? దగ్గిర సంబంధం దగ్గిర సంబంధమని పదిసార్లు దండకం చదువుతావు. మా అక్కయ్య కొడుకు నాకు దగ్గిరో దూరమో నువ్వు చెప్పాలా? ఆదీ చదువుకుంది..." అంటూ తేల్చేశారు నాన్నగారు.

"ఆ చదువే కొంప ముంచింది ఆ యింటర్మీడియేట్ తోనైనా దాని చదువాపేసి పెళ్ళిచేస్తే బాగుండేదా? ఇప్పుడింతికీ అతగాడు రెండు క్లాసులు తక్కువలో వున్నాడనేకదా ఇంత పెంకితనం.'' అంది అమ్మ.

"ఇంత పెంకితనం వున్న నన్ను పెళ్ళాడి బావ ఏం సుఖపడతాడు? బావంటే అంత అభిమానముంది కనక తగ్గ మంచి పెళ్ళి కూతుర్ని చూసిపెట్టు" శోభ సలహా యిచ్చింది.

''సరే అది మామూలుపాటే. ఈ యింట్లో ఒకప్పుడు మాత్రం నా మాట చెల్లింది కనకనా!'' అంది అమ్మ.

అమ్మను చూస్తే జాలేస్తుంది. 'నా పెళ్ళి విషయంలో నీ మాట చెల్లిస్తానమ్మా! నీ యిష్టమొచ్చిన పిల్లనిచూడు, నేను పెళ్ళాడతాను' అందామనుకుని చటుక్కున మా మేనమామ కూతురు మాట జ్ఞాపకమొచ్చి ఊరుకున్నాను. అసలు నిజం చెప్పాలంటే నాన్నగారికి సంబంధం యిష్టంలేదు. దానికి కారణాలు ఒకటి వాడి చదువు. రెండు పెద్దంతస్తులో వున్న సంబంధం చెయ్యాలనీ, కామేశానికిచ్చి చేస్తే....ఆస్తి చూసి వితంతువయిన అప్పగారితో వియ్యమందేరని లోకు

అనుకుంటారన్న అభిమానం, మూడు - ఎవరి దగ్గిరా భయభక్తులు లేకుండా పెరిగాడు. రేపొద్దున్న ఎలా తయారవుతాడోనన్న భయం.

*　　　*　　　*

బావ మెయిలుకొస్తాడని తెలుసుండీ కూడా స్టేషన్‌కి వెళ్ళలేదు. వెళ్ళమని ఇంట్లో ఎవళ్ళూ అనాలేదు. బావమాట తలుచుకుంటే గుండెల్లో దడగా వుంది. వాడు రాకపోయినా బాగుండు ననిపించింది.

''ఏరా, నీకు కాలేజీ టైం అవ్వలేదూ?'' అడిగేరు నాన్న.

''ఇవ్వాళ కాముడొస్తున్నాడు కాదూ....వెళ్ళటంలేదు.''

''ఓహో!...... మరి శోభా?''

''వెళ్ళదుట.''

నిజానికి శోభా కాలేజీకి వెళ్ళే ప్రయత్నంలో లేదు. ఇంకా కిందేవుంది. ఇంతకీ నాన్నగారు ఆఫీసు కెళ్ళీలాగ లేరు. అమ్మ యీపాటికి వంటయిందని కబురంపేది. ఇవ్వాళ అదీలేదు. ఏమిటో ఇంట్లో అందరం జడ్జి తీర్పుకోసం ఎదురుచూసే నేరస్థుల్లాగా కాముడుకోసం ఎదురు చూస్తున్నాం. కాముడు నాలుగు సంవత్సరాల తర్వాత వస్తున్నాడు. ఈపాటికి ఎంత మారిపోయి వుంటాడో! ప్రతీసారి వాడిదివరకు ఎప్పుడు మా యింటికొచ్చినా ఏదో వొకటి పట్టుకొచ్చేవాడు నాకూ శోభకి. ఈసారి ఏం పట్టుకొస్తాడో. తన్ను పెళ్ళాడటం శోభకి యిష్టం లేదని తెలుస్తే ఎంత చిన్నబుచ్చుకుంటాడో. తర్వాత బావకి ఎలాగ నామొహం చూపెట్టడం .... ఇలా ఆలోచించుకుంటూ కూర్చున్నాను.

అప్పుడే కింద వొంటింట్లో బావ గొంతు వినబడింది. నౌకరు వెంకన్న ఒక పెద్దట్రంకు పెట్టి బెడ్డింగూ మేడమీదకి మోసుకొచ్చి హాల్లో పడేశాడు. కుర్చీలోంచి లేద్దామా మానదామా అని పుస్తకం మూసేసి తటపటాయిస్తుంటే రెండు అంగల్లో మేడమెట్లెక్కేసి 'ఓరి....ఇంకా స్టేషన్‌కి వస్తావనుకుంటుంటే.... ఇక్కడ కూర్చుని స్కూలు కుర్రాడిలాగా పాఠాలు వల్లిస్తున్నావూ?'' అంటూ భుజంమీద చరిచాడు.

''అబ్బే కొద్దిగా తల ..'' అనబోతున్నాను.

''ఏం మావయ్యా!....పాఠం అప్పచెబితేనేగాని బయటకెళ్ళొద్దన్నావా ఏమిటి పిచ్చి?'' అన్నాడు నాన్నగారికేసి వెడుతూ.

''అం....ఏరా కాముడూ... అమ్మ కులాసాగా వుందా?"

''ఉంటికాని మీమీద కోపంగా వుంది. నువ్వూ అత్తయ్యా అటురావడం మానేశారు సరిగదా నాలుగేళ్ళబట్టి కుర్రాళ్ళనికూడా పంపించనందుకు కోపంగా ఉందని చెప్పమంది.''

''వాళ్ళు వొద్దామని అనుకొంటూనే వున్నారు....ఎప్పటి కప్పుడే ఏదో చదువులూ పరీక్షలూ....పోనీ, నువ్వు రావటానికేంరా?"

''ఏటికొకసారి పరీక్షల కెళ్ళేవాళ్ళకే తీరుబడిలేదుకాని సెప్టెంబరూ మార్చీ రెండుసార్లు పరీక్ష కెళ్ళేనాకు తీరుబడి వుంటుందా?''

''నీకు ప్యాసైతేరాలన్న పట్టింపులేదుగా!" అంది శోభ కాఫీ గ్లాసులు మాకు అందిస్తూ.

''అబ్బో! పిట్ట కూత పట్టిందే! మామయ్యా! ఇంక అపితే లాభం లేదు. దీనికి త్వరగా పెళ్ళి చేసెయ్యాలి."

నేనూ నాన్నగారూ చిరునవ్వు మొహం పెట్టేము. శోభ రెండడుగులు వెనక్కి వేసింది.

''మరి, శోభా! ఇవ్వాళ నీకు బడిలేదూ?'' అడిగేడు కాముడు.

''ఇంకా నీకు పాత అలవాటు పోలేదు''అని గుర్తుచేసింది శోభ.

''ఓ....తూనాబొడ్డు ...కాలేజ్.''

''లేదు. నివ్వొచ్చేవని శలవిచ్చేశారు.''

''అ........! అనుకున్నాను సుమీ మామయ్య ఆఫీసుకు కూడా శలవేమో."

''సరేకాని....ఇన్నాళ్ళు హైదాబాద్‌లో ఏం చేస్తున్నావురా? అప్పుడనగా వెళ్ళినవాడివి.'' అడిగారు నాన్న.

బావ ఫెల్ట్ హేట్ చేతిలో తిప్పుతూ నేరాన్ని ఒప్పుకునీ ధోరణిలో అన్నాడు: ''లేదుమామయ్యా! క్రికెట్ మేచ్ ఐపోగానే తిరిగొచ్చేద్దామనుకున్నాం. అక్కడనుంచి మా స్నేహితు లందరూ అజంతా ఎల్లోరా వెళ్ళాలన్నారు. అవన్నీ తిరిగివచ్చేక, అయిన ఆలస్యం ఎలాగా అయింది నెహ్రూను చూసినట్టూవుంటుంది విశాలాంధ్రసంగతి తేల్చుకున్నట్టూ వుంటుందని....ఇన్నాళ్ళూ ఆగిపోయాం.''

''ఐతే, నెహ్రూను కలుసుకు మాట్లాడేవన్నమాట!" అడిగింది శోభ.

''అఁ!....నా కంత తీరుబడేదీ? వెళ్ళబోయేటప్పుడు మాత్రం వెడుతున్నట్లు చెయ్యూపేను. సరేనన్నట్లు నెహ్రూ చెయ్యూపేడు.—అంతే. తిరిగొచ్చేశాను.''

''అబ్బా! అంతమంది జనంలో నెహ్రూ నిన్ను అనుమానాలు కట్టేదేఁ!'' అంది శోభ తన సహజ వ్యంగ్య ధోరణితో.

''అంతమంది జనంలో వుండటం ఖర్మమేమిటి - ప్రత్యేకంగా ఏ చెట్టో ఎలక్ట్రిక్ స్తంభమో ఎక్కి వుంటాడు'' అన్నాను బావ ఫెల్ట్ హేట్ బావనెత్తిమీద పెడుతూ.

* * *

అన్నం వడ్డిస్తూ అమ్మ 'కామేశం!....ఇప్పుడు నువ్వు హైద్రాబాదెందుకు వెళ్ళేవో నాకు చెప్పేవుకాదు" అంది.

''క్రికెట్ మేచ్ చూడటాని కత్తయ్యా'' అన్నాడు బావ.

''ఉత్తదమ్మా! .... అసలు సంగతి - బావ పరీక్ష పేపర్లు అక్కడికి వెళ్ళేయిట'' అంది శోభ. అమ్మ శోభకేసి చురచుర చూసింది.

"వెడితే ఒకటీ రెండూ వెడతాయి. అలాగ ఒకటీ రెండూ పేపర్లు పాడు చెయ్యటంవల్ల బావ పరీక్ష ఎప్పుడూ పోలేదు'' అన్నాను అమ్మ కళ్ళు తప్పించుకుంటూ.

''ఒరేయ్! అందరూ మీలాగే పరీక్షలు ప్యాసైతే యూనివర్సిటీల కేం లాభం? నాలాంటివాళ్ళిలా విద్యాపోషణ చెయ్యబట్టే ఆంధ్రలో మూడు యూనివర్సిటీ లున్నాయి'' అన్నాడు బావ.

''అడగటం మరచిపోయాను, ఎలా రాశావురా మొన్న సెప్టెంబరులో?'' అని పరామర్శించారు నాన్నగారు.

''నా లోటులేదు మామయ్యా! ...ఇంక ప్యాసవ్వడ మంటావా.... మొన్న సిద్ధాంతిగారు అమ్మతో అంటుంటే విన్నాను-నాకు వచ్చే యేటితో గాని ఏన్నాలిటి శని పూర్తవదుట. అందుచేత....''

''మళ్ళీ మార్చిలో కాని మోక్షం లేదంటావు'' అంది శోభ.

''అంత ఆక్షేపించకపోతే శోభా, నువ్వొచ్చి శలవల్లో నాకు ప్రైవేటు చెప్పకూడదూ?''

"చెబితే మాత్రం బావా, నీ జాతకం మార్చగలనా? నన్ను చూసి నీ ఏన్నాలిటి శని వెనక్కెడతాడా?"

"చెప్పలేం. 'స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః' అన్నారు. సూర్య చంద్రాదుల్ని నిలబెట్టేసి గతులు తప్పించిన ఆడాళ్ళు కూడా వున్నారు పురాణాల్లో. ఏమో, నీ ఆగ్రహానికి భయపడి ఆ శనిగ్రహం కొంచెం తమాయిస్తాడేమో!''

బావ మాటల్లో అజేయుడు ఓ పట్టాన్ని లొంగదీయటం కష్టం. చిన్నప్పట్నించీ అంతే. శుద్ధ మొండిఘటం.

"దాని వాగుడుకేంగాని.... కామేశం.... అయితే.... బియ్యే తర్వాత.... ఇంకా ఏదైనా పెద్ద చదువు చదువుతావా?'' అంది అమ్మ అమాయికంగా.

'ఉట్టి కెగరలేనమ్మ....' సామెత జ్ఞాపకం వచ్చిందిలాగుంది, నాన్నగారు మునిముని నవ్వు నవ్వుకున్నారు.

"ఇంక చదవదలుచుకోలే దత్తయ్యా!.... చదువుకు నేనంటే యిష్టం లేనప్పుడు దాన్ని మాత్రం బలవంతం చెయ్యడమెందుకు? అందుచేత చదువు ఆపేసి ఇంక వ్యాపారమా.... వ్యవసాయమా అని ఆలోచిస్తున్నాను'' అన్నాడు నాన్నగారికేసి తిరిగి.

''నీకదే మంచిదిరా! హాయిగా భూములున్నవాడివి.... వ్యవసాయం చూసుకుంటే...." అంటున్నారు నాన్నగారు.

"చాల్లెండి.... శోభకి కాబోయే మొగుడు....''

అమ్మ శోభ మీదా నాన్నగారి మీదా కసి తీర్చుకోటానికి చేసిందో ఈ సాహసం లేకపోతే బావని చూసి మురిసిపోయి అందో ఆ మాటలు నాకు అర్థం కాలేదు. నాన్నగారు విస్తట్లో కూరముక్కని ఒక్క నొక్కు నొక్కారు పళ్ళు బిగించి. శోభ ముద్ద నోట్లో పెట్టుకోబోతూ చెయ్యి దించేసింది. క్షణం కళ్ళు చీకట్లు కమ్మినట్టయ్యి నేను మంచినీళ్ళ గ్లాసుకోసం తడుముకున్నాను. చివరకి బావే అమ్మ నోటికి అడ్డం వచ్చాడు.

"నేను పెళ్ళాడటమేమిటి అత్తయ్యా?.... దానికి పెద్ద చదువు చదివిన వాడినీ, పెద్ద హోదాలో ఉద్యోగం చెయ్యటానికి అవకాశం వున్నవాడినీ చూసి చెయ్యాలి కాని.... మరేం భయపడకు శోభా!.... నేను నిన్ను పెళ్ళాడనులే. అన్నం తిను'' అన్నాడు బావ.

'మేనత్త మేనమామ బిడ్డలూ పెళ్ళాడతారనుకోవడంలో తప్పేముంది అన్న వుద్దేశ్యంతో మీ అత్తయ్యుంది. ఇందులో బలవంతం చెయ్యంకదా! అంచేత అదీ భయపడక్కర్లేదు'' అన్నారు నాన్నగారు సమయస్ఫూర్తిగా.

*　　*　　*

నాన్నగారు గదిలో కూర్చున్నారు హాల్లో అమ్మ, శోభా సోఫాలో కూర్చున్నారు. నేనూ, బావ తివాసీమీద బావ పెట్టె ముందర చతికిలపడ్డాం. శోభలో పొద్దుటినుంచీ వున్న వుత్సాహం లేదు. పరధ్యానంగా వుంది. అమ్మ తాంబూలం వేసుకుంటూ రెట్టించిన వుత్సాహంతో బావకేసి చూస్తూవుంది. ముందర పెట్లోంచి రెండు నిలువుటద్దాలు తీశాడు.

''ఇవెందుకురోయ్.... మంగలిషాపుకాని పెడుతున్నావా యేమిటి.... ఇందాక ఏదో వ్యాపారం అన్నావులే'' అన్నాను.

"రేప్పొద్దున్న శోభ మా యింటికొస్తే నిలువుటద్దమైనా లేదని ఆక్షేపిస్తుందని'' అన్నాడు బావ.

''అయితే రెండెందుకూ?'' అమ్మ అడిగింది.

"పెద్ద కాలవగట్టునున్న తోటలో కింద యేడు బంగళా వేయించానుగా. అందులో కొకటి, మా యింట్లో కొకటి.''

తోటమాట వినగానే పూర్వ స్మృతులన్నీ జ్ఞాపకమొచ్చాయి. చిన్నప్పుడు ఆ తోటలో నేనూ, శోభా, కాముడూ, ఆ వూరి స్నేహితులు బువ్వాలాట బొమ్మల పెళ్ళిళ్ళు చేసుకునీ వాళ్ళం. తరువాత కోతికొమ్మచ్చి.... ఆ తర్వాత పేకాట.... అలాగ ఆ తోట చిన్నప్పట్నించీ మాకో ఆప్తబంధువులాగ ఎంతో సన్నిహితమైపోయింది. నాలుగేళ్ళనుంచి మా చదువుల కోసం నాన్నగారు యీ వూరు బదిలీ చేయించుకున్నప్పట్నించీ అటు వెళ్ళలేదు. అంతక్రితం శలవల్లో ప్రతి యేడు బావ వూరు వెళ్ళేవాళ్ళం. ఆ తోటలో పగలల్లా గడిపేవాళ్ళం. ఒక్కొక్క రోజున మా అత్తయ్య భోజనం, ఫలహారాలు కూడా అక్కడికే పంపేది. క్రిందటిసారి మేము వెళ్ళినప్పుడు నేనూ శోభా మొక్కలు పాతి వన మహోత్సవం చేశాం.

"ఒరేయి! నేను నాటిన మొక్కలు బతికేయా?'' అడిగేను.

"సగం పైగా బతికేయి.... శోభ పాతిన సంపెంగ మొక్కలు రెండు యింత ఎత్తు పెరిగేయి.... యించుమించు శోభ భుజాల దగ్గిర కొస్తాయి'' అన్నాడు.

పెట్లోంచి ఒక్కొక్కటే పైకితీసి నాకో ట్రైపిన్ను, నాన్నగారికో దంతం పిడితోవున్న ఆఫీసు కవర్లు చింపుకునే కత్తి, శోభ కొక మొరాకో తోలు చేతి సంచి యిచ్చాడు. మిగిలినవి తను కొనుక్కొన్న బట్టలూ ఫ్యాన్సీ సామానులు.

"నీకూ మా అమ్మకి ఏం తీసుకురావాలో తెలియలేదత్తయ్యా!'' అన్నాడు పెట్లోనే యింకా చెయ్యి వుంచి.

"మీరందరూ తెచ్చుకోవటంకంటే నాకూ వదినకీ కావల్సిందేముంది నాయనా?'' అంది అమ్మ బావ చిన్నబుచ్చుకోకుండా.

"నువ్వూ అమ్మా పురాణం చదువుకోటానికి పుస్తకాలు పెట్టుకునే వ్యాస పీటలు తెచ్చాను.'' అంటూ అమ్మకొకటి అందించాడు. అమ్మ మొహం సంతోషంతో ఆ వ్యాసపీటంతయింది.

"ఒరేయి రామం! కామేశాన్ని చూసి బుద్ధి తెచ్చుకోవాలిరా! అమ్మకో వ్యాసపీట తేవాలని నీకు తోచిందా?'' అంది నావైపు తిరిగి అమ్మ.

ఇంతలో నాన్నగారు డ్రెస్ వేసుకుని హాల్లోకివచ్చి "ఒరే కాముడూ! .... ఆఫీసు కెళ్ళొస్తాను. సాయంత్రం త్వరగా యింటికొచ్చెయ్యండి, ఊళ్ళో మంచి సినీమాలు కూడా ఏమీ లేవు" అన్నారు.

"ఉన్నవాటిల్లోనే మంచి సినీమా చూసొస్తాం మామయ్యా" అన్నాడు కాముడు

నాన్నగారు కిందకి వెళ్ళి కారు స్టార్ట్ చేసి మళ్ళీ ఏం జ్ఞాపక మొచ్చిందో నన్ను పిలిచారు. కిందకి వెళ్ళేను.

"నే నిన్నాళ్ళూ ఏదో సందిగ్ధంలో వున్నాను కాని .... ఇంక ఆలోచించ వలసిందేమీ లేదు. శోభని కాముడికివ్వడం నాకిష్టంలేదు. చదువూ సంధ్యా లేదు సరికదా, వాడికి షికారూ షోకులూ ఖర్చులూ ఎందుకు చెప్పు? పైగా, చదువు కూడా మానేసి యింక వ్యవసాయం మొదలెడతాట్ట. ఇంక శోభని బలవంతం చెయ్యడమంత అన్యాయం మరొకటిలేదు. భోజనాల దగ్గిర అమ్మధోరణి చూశావు కదా! ఆడాళ్ళ తెలివి తక్కువ అలాగే వుంటాయి నే నెందుకు చెబుతున్నానంటే.

నేను యింట్లో లేకుండా చూసి అమ్మ దానికి నూరిపొయ్యకుండా చూడు. అసలు దాని పెళ్ళివిషయం ఎత్తటానికి వీల్లేదు...తెలిసిందా... నిన్నందుకే పిలిపించాను."

నేను తిరిగి మేడెక్కి హాల్లో కెళ్ళేటప్పటికి బావగొంతు వినబడుతోంది:

బా:— "అదికాదత్తయ్యా... మొన్న అమ్మ వుత్తరంలో కూడా రాసిందిట కదూ?"

అ: "రాసింది నాయనా! నువ్వందుకే వస్తున్నావనికూడా తెలుసు. ఇంతకీ నా యిష్ట మేముంది?...."

నాకు పై ప్రాణాలు పైకి పోయాయి. అనుకున్నంత ప్రమాదం జరిగింది. అమ్మనోటికి హద్దూపద్దూ లేదు. పాపం, శోభ దెబ్బతిన్న పావురంలాగా బిత్తర పోయి నాకేసి చూస్తోంది

బా :- "మరయితే ఆలస్యమెందుకూ? రేపు పిన్నిద్దర్నీ నాకూడా తీసుకు పోతాను. పదిరోజులుండి వస్తారు."

కాస్త ప్రాణం కుదుటపడింది. దానితో ఎందుకైనా మంచిదని అమ్మతో కాఫీ - ఫలహారాల సంగతి చూడమని జ్ఞాపకం చేసి కిందకి పంపించేశాను. తర్వాత బావ తను హైద్రాబాద్‌లోనూ, అజంతా ఎల్లోరాలలోనూ తీసిన ఫోటోలు చూపెట్టడంతో నా ఆవేదన కొంత వుపశమించింది.

* * *

సాయంత్రం నేనూ బావా వరండామీద కూర్చుని బాతాఖానీ కొడు తున్నాం. హాల్లో శోభ వయొలిన్ వాయించుకుంటోంది.

"పాటే అనుకున్నాను. వయొలిన్ కూడా బాగా వాయిస్తుందిరా!" అన్నాడు బావ. నేను మాట్లాడలేదు.

"నిజంగా శోభలాంటి చెల్లెలు నాక్కూడా వుంటే బాగుండు ననిపిస్తోంది."

ధోరణి ఎలా మార్చాలా అని ఆలోచిస్తున్నాను

"ఏరా, శోభకి పెళ్ళి సంబంధాలేమి చూట్టంలేదురా మావయ్యా?"

"లేదు" అన్నాను సమాధానం తప్పనందుకు విచారిస్తూ.

"భోజనాల దగ్గిర అత్తయ్యన్నమాటలు జ్ఞాపకమున్నాయిరా? మా అమ్మా అత్తయ్యా పాతకాలపు మనుషులు మొన్న నేదో వుత్తరం రాసిందట, శోభని

నాకిచ్చి పెళ్ళి చెయ్యమని చెప్పి. తర్వాత ఆ విషయం నాకు చెప్పింది. నేను మా అమ్మని కేకలేశాను. నేను శోభ పెళ్ళాడితేనే మనం మేనత్త-మేనమామల బిడ్డలంరా? అసలు నేనందుకే పరిగెత్తుకొచ్చాను నాకు శోభని పెళ్ళాడాలన్న ఉద్దేశ్యంకాని అంత స్వార్థంకాని లేవు, దానికి మంచి చదువుకున్నవాడినీ పెద్దవ్యాపారంలోనో వున్నవాడినీ తీసుకొచ్చి పెళ్ళి చెయ్యాలని మీకంటే నాకు రెట్టింపు వుత్సాహం వుంది."

ఆ మాటల్లో వున్న స్వార్థరాహిత్యం, అభిమానం తలుచుకుంటుంటే.... నేను శోభనైతే బావని తప్పకుండా పెళ్ళాడేవాణ్ణనిపించింది.

''మే మెవళ్ళం ఆ విషయాలు ఆలోచించంటలేదురా. శోభ యిష్టం....

''శోభ యిష్టం అంటావేమిట్రా? దాని ఇష్టం అని వంక పెట్టి ఏదో కట్నం లేని సంబంధంకదా అని చవగ్గా నాకిచ్చి పెళ్ళిచేద్దామని చూస్తున్నారా ఏమిట్రా?"

''అబ్బెబ్బె, అదికాదురా! శోభ....''

"ఒరేయి, దానికితగ్గ సంసంధం చూడండి. కట్నం నే నిస్తాను. అంతే కాని........''

''ఇంతకీ ఏమిటి సంగతి? నీకేమైనా పెద్ద కట్నాలతో సంబంధాలొస్తున్నాయా ఏమిట్రా?'' అన్నాను నిజంగా సందేహం కలిగి.

"చా, ఇంకా లేదురా. మా అమ్మ అందరితోటీ మేనరికం వుందని చెప్పేసింది. ఏదో ఆ వంకని ఆ పోరు కొంత తగ్గింది ఇంక కట్నం పుచ్చుకునీటంత ఖర్మం ఏం కాలిందిరా? పిల్ల నచ్చాలి కానీ.''

''పిల్ల నీకు నచ్చడం కష్టమే.. ఒకవేళ నచ్చినా మళ్ళీ ఆ పిల్లకి నువ్వు నచ్చాలికదా. అది మరీకష్టం?'' అన్నాను కాస్తధోరణి శోభ పెళ్ళిలోంచి తన పెళ్ళికి మారుద్దామని.

''అందుచేత మామయ్యతోటీ మా అమ్మరాసిన వుత్తరం....''

శోభ హాల్లో వయొలిన్ ఆపేసి ఎంతసేపయిందో తెలియదు. చటుక్కున బావ చెయ్యినొక్కి ఊరుకోమని సంజ్ఞచేసి ''అరవ్వొస్తోంది. మనం యింక నెమ్మదిగా బయలుదే రొచ్చురా'' అన్నాను బావని లేవదీస్తూ.

*　　*　　*

బావ వెళ్ళిపోయిన మర్నాడు నేను హాల్లో కూర్చుని బూట్ పాలిష్‌కి ఉపక్రమించేను. నా పక్కనే కూర్చుని అమ్మ నాన్నగారికి తమలపాకులు రాస్తోంది. నాన్నగారు ఆఫీసు గదిలో ఉత్తరాలు రాసుకుంటున్నారు. కాలేజ్‌కి బయలుదేరే ప్రయత్నంలో శోభ లోపలిగదిలో పుస్తకాలు సర్దుకుంటోంది.

''కాముడి సంబంధం మనకక్కర్లేదని రాసెయ్యొచ్చు నన్నమాటేనా?'' అన్నారు నాన్నగారు.

"ఏమిటి నాన్నా'' అంటూ వన్స్‌మోర్ మొహంతో ప్రత్యక్షమయింది శోభ.

"అబ్బే ... అక్కయ్యకి జవాబు రాయాలికదా?"

"రాసెయ్యి నాన్నా, శోభ కాముణ్ణి తప్ప ఇంకెవ్వడినీ పెళ్ళాడదుటని'' అంది శోభ నవ్వుతూ.

"అలాగే రాసెయ్యండి తెగులు కుదురుతుంది' అంది అమ్మ.

"తెగులు కుదిరింది కనకనే అలా రాయమన్నాను. ఇన్నాళ్లూ చదువుకున్న దాన్నన్న గర్వంతో బావని కాదన్నాను. బావ యిక్కడికొచ్చి నేను కొట్టుకు పోతున్న అజ్ఞాన ప్రవాహంలోంచి రక్షించాడు. చదువువల్ల నేను సంపాదించినవి అహంభావం, స్వార్థం. చదువులో వెనకబడినా మానవ సమాజమైన త్యాగం, ఔదార్యం బావలో వున్నాయి. సహజమైన బంధుప్రేమ, నిష్కామమైన అభిమానం, నిర్మలమైన మనస్సు, నిరంతరమైన...."

నాకు శోభ ధోరణి కొత్తగాదు. అమ్మ మొహంలోకి చూశాను. సంతోషంతో రెట్టింపయ్యింది. నాన్నగారి చేతిలో పెన్ క్యాప్ లాగుంది-కిందపడి చప్పుడయింది. నేను మేడమెట్లు చల్లగా దిగేను. ఇంకా శోభ ఉపన్యాసం వినబడుతూనే వుంది.

*